RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 271 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం గురువారం, 4 ఏప్రిల్ 2024 పేజీలు : 4 వెల : 2/-

# భాగ్యనగరం రూపురేఖలు మారుతున్నాయ్




హైదరాబాద్‌కు మణిహారమైన ఔటర్ రింగ్‌రోడ్డు వరకు GHMCని విస్తరించడానికి రేవంత్ సర్కారు కసరత్తు కొనసాగుతోంది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను కలిపి మెగా గ్రేటర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా జూన్ నాటికి ప్రణాళికను పూర్తిచేయనున్నారు. అనంతరం సీఎంతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు సమయం ఉండటంతో ప్రాథమిక నివేదికను ఎన్నికల కోడ్ తరువాత సీఎం ముందుంచాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం బల్దియా పరిధిలో 150 డివిజన్లు ఉన్నాయి. దాదాపు 74 లక్షలమంది ఓటర్లు ఉన్నారు. జనాభా కోటి వరకు ఉంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను బల్దియాలో విలీనం చేస్తే జనాభా మరో 60 లక్షల వరకు పెరుగుతుంది. అదనంగా మరో 50 నుంచి 60 డివిజన్ల వరకు పెరుగుతాయని అధికారుల అంచనా. అప్పుడు డివిజన్ల సంఖ్య 210 వరకు పెరిగే అవకాశం ఉంది. మెగా గ్రేటర్ పెద్దగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి భావించి.. దీన్ని రెండుగా చేయమని ఆదేశించగా అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. 2007లో 12 మున్సిపాల్టీలు, 8 గ్రామపంచాయతీలతో GHMC ఏర్పాటైంది. దాదాపు కోటి జనాభా ఉండగా 150 డివిజన్లు ఏర్పాటు చేశారు. ఈ 150 డివిజన్లలో బల్దియాకు వచ్చిన నిధులతో బాగానే అభివృద్ధి జరిగింది. కానీ హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 7 కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీలు మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలోనే గ్రేటర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారనే చర్చ జరుగుతోంది. రాజధాని పరిధిలో ప్రస్తుతం 5 మాస్టర్‌ప్లాన్లు ఉండటంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఐదింటిని విలీనం చేసి.. వచ్చే 30 ఏళ్ల అమలులో ఉండే విధంగా ఒకే మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని సీఎం ఆదేశించారు. దీనికి అనుగుణంగానే అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇదే సమయంలో గ్రేటర్‌ను కూడా విస్తరించాలని సీఎం భావించారు. ORR లోపల ఉన్న సంస్థలన్నింటిని కలిపి మెగా గ్రేటర్‌ను ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. 3 నెలల్లో దీనిపై ప్రణాళిక రూపొందించాలని సీఎం ఆదేశించడంతో అధికారులు ఆ పనిలో ఉన్నారు.




## పరిశ్రమ డైరెక్టర్ సహా ఐదుగురి మృతి

హత్నూర: సంగారెడ్డి జిల్లాలో బుధవారం సాయంత్రం ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. హత్నూర మండలం చందాపూర్ వద్ద ఉన్న ఎస్బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పరిశ్రమ డైరెక్టర్ రవితో పాటు మరో నలుగురు కార్మికులు మృతి చెందారు.

పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలార్పేందుకు ప్రయత్నిస్తున్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## తెలంగాణ షాకింగ్: రేవంత్ రెడ్డి కుర్చీ.. కిషన్ రెడ్డి లాగేస్తారా?

హైదరాబాద్ : సాధారణంగా అసెంబ్లీ ఎన్నికలు ముగిసి.. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్నెళ్ల పాటు రాజకీయ వాతావరణం స్తబ్ధుగా ఉంటుంది. అందుకు భిన్నంగా తెలంగాణలో రాజకీయ ముఖ చిత్రం మారింది. రేవంత్ రెడ్డి సీఎం గా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత పట్టుమని పది రోజులు కూడా ప్రశాంతంగా పాలన చేసింది లేదు. నిత్యం ఏదో ఒక చిక్కుముడి.. ఆరోపణలు.. ప్రభుత్వాన్ని కూల్చేస్తామంటూ బెదిరింపులు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే కడియం శ్రీహరితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు త్వరలో మా ప్రభుత్వమే రాబోతుందంటూ వ్యాఖ్యానించారు. అప్పటి నుంచి ఆపరేషన్ ఆకర్ష్ కు సీఎం తెరతీశారు. ఆ పార్టీ ముఖ్య నాయకుల్ని, ఎమ్మెల్యేలు, ఎంపీలను పార్టీలో చేర్చుకుంటూ బీఆర్ఎస్ ను దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా తాజాగా బీజేపీకి చెందిన శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి సంచలన వ్యాఖ్యలు కలకలం సృష్టిస్తున్నాయి.

బీజేపీ ఎమ్మెల్యేలను టచ్ చేస్తే 48 గంటల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. కోమటిరెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. సొంత తమ్ముడు రాజగోపాల్ రెడ్డి భార్యకే ఎంపీ టికెట్ ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా తెలంగాణలో మరో ఏక్ నాథ్ షిండే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అవుతారని ఆరోపించారు. ఈ మేరకు ఆయన కేంద్రమంత్రి గడ్కరీ ముందు ఒప్పుకున్నారని తెలిపారు.

బీజేపీని టచ్ చేస్తే 60మందిని 48 గంటల్లో లాగేస్తామని హెచ్చరించారు. అయితే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. బీజేపీ ఇలా చేస్తే తెలంగాణ సమాజం ఊరుకుంటుందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏక్ నాథ్ షిండే శివసేనను చీల్చి ఉద్ధవ్ ఠాక్రేని



మోసం చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని.. కానీ బీజేపీ దీనిని గొప్పగా చెప్పుకుంటోంది అని విమర్శిస్తున్నారు. మరోవైపు ఈ తరహా వ్యాఖ్యల వల్ల రేవంత్ కు ఊతం అందించినట్లే.. మా ప్రభుత్వాన్ని కూల్చేస్తామంటూ బెదిరిస్తున్నారు అందుకే చేర్చుకుంటున్నాం అని కాంగ్రెస్ చెప్పుకుంటుంది. ప్రభుత్వాన్ని కూల్చేస్తాం అనే వ్యాఖ్యలు లోక్ సభ ఎన్నికల్లో ఆ పార్టీపై తీవ్ర ప్రభావం చూపుతాయని.. వీటివల్ల లాభం చేకూరపోగా.. నష్టమే ఎక్కువ జరిగే అవకాశం ఉంది.



# సారు సప్పబడ్డాడే...!

# బిజెపిపై నోరెత్తని వైనం

## బిజెపికి కేసీఆర్ భయపడుతున్నాడా...!?

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల దాకా బీజేపీని, కాంగ్రెస్‌ని తిట్టి పోసిన గులాబీ బాస్ కేసీఆర్ ఇప్పుడు కమలం విషయంలో సైలెంట్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత గాయం కారణంగా.. రెండు నెలల రెస్ట్ తర్వాత బయటకు వచ్చిన ఆయన.. కృష్ణా ప్రాజెక్టుల మీద ఒకసారి, రైతుల పరామర్శ మీద మరోసారి జనంలో పర్యటించారు. అయితే ఈ రెండు చోట్లా కూడా సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పాలన, మంత్రులనే టార్గెట్ చేశారు. ఒకప్పుడు.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మోడీ ప్రభుత్వాన్ని లేకుండా చేస్తాననీ, తనకు అవకాశం ఇస్తే జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పుతానని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బీజేపీపై వయొలెంట్‌గా ఉన్న కేసీఆర్.. ఇప్పుడెందుకు సైలెంట్ అయ్యారు..? మరో రెండు నెలల్లో లోక్ సభ ఎన్నికలు జరగబోతున్నాయి. కేంద్రంలో బీజేపీ, ఇండియా కూటమి మధ్య హోరా హోరీ ఫైట్ నడుస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు ఓటర్లు కూడా దేశాన్ని దృష్టిలో పెట్టుకొనే ఓట్లేస్తారు. అప్పుడు కేసీఆర్ కూడా స్థానిక ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీని టార్గెట్ చేయాలి. కానీ కమలం పార్టీ విషయంలో గులాబీ అధినేత పల్లెత్తు మాట కూడా అనడం లేదు. మొదట్లో బీఆర్ఎస్ నేతలను చేర్చుకోబోమని సీఎం రేవంత్ రెడ్డి క్లియర్‌గా చెప్పారు. కానీ ఎప్పుడైతే కాంగ్రెస్ సర్కార్ కూలిపోతుందని కామెంట్స్ మొదలయ్యాయో.. అప్పుడు గాంధీభవన్ గేట్లు తెరిచారు రేవంత్ రెడ్డి. BRSని టార్గెట్ చేయడంతో.. ఒక్కొక్కరుగా వచ్చి కాంగ్రెస్‌లో చేరిపోతున్నారు. దాంతో ఒకప్పుడు తాను ఎదిరించిన బీజేపీ, అధికారం చేపట్టిన కాంగ్రెస్.. రెండింటికీ శత్రువుగా మారారు కేసీఆర్. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీజేపీని ఎదురిస్తే కష్టాలు కోరి తెచ్చుకోవడమే అనుకున్నారు గులాబీ బాస్. పైగా లిక్కర్ కేసులో కవిత తిహార్ జైల్లో ఉన్నారు. ట్యాపింగ్ కేసు ఎంత దూరం వెళుతుందో, BRSలో ఏ పెద్ద తలకాయలకు చుట్టుకుంటుందో తెలీదు. కేంద్ర ప్రభుత్వానికి తెలియకుండా విదేశాల నుంచి ఎక్విప్‌మెంట్ తెప్పించి చేసిన తప్పుడు పని ఫోన్ ట్యాపింగ్. టెలిగ్రాఫ్ యాక్ట్ కింద చర్యలు సీరియస్‌గానే ఉంటాయని అంటున్నారు. మొన్నటికి మొన్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూడా బీజేపీ దోస్తీకి ప్రయత్నించారు గులాబీ బాస్. ఇదే విషయాన్ని పార్టీ నుంచి వెళ్ళిపోయిన ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా చెప్పారు. బీజేపీ ఫ్రెండ్షిప్ వద్దని గెంటేసినా ఆ పార్టీతో పెట్టుకుంటే.. మరిన్ని ఇబ్బందులు వస్తాయని గ్రహించారు గులాబీ బాస్. అందుకే కమలంపై సైలెంట్ అయ్యారు.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# బంగ్లాదేశ్ లో బాయ్ కాట్ భారత్? ఏమిటీ లొల్లి?

బంగ్లాదేశ్.. ఈ దేశ ఉనికికి కారణం భారత దేశం. వారి ఆశలకు.. ఆకాంక్షలకు తగ్గట్లు బంగ్లాదేశ్ ను ఏర్పాటు చేసిన భారత్ అంటే.. ఆ దేశీయుల్లో ప్రత్యేకమైన అభిమానం ఉంటుందన్న సంగతి తెలిసిందే. భారత్ తో అత్యంత సుదీర్ఘమైన భూసరిహద్దు కలిగి ఉన్న ఈ దేశం వాణిజ్య అవసరాల కోసం మన మీద ఆధారపడుతుంది. అంతేకాదు.. భారత్ కు ఎంతో దగ్గరైన దేశంగా పేరుంది. అలాంటి దేశంలో ఇప్పుడు కొత్తగా బాయ్ కాట్ భారత్ అన్న నినాదం మొదలు కావటమే కాదు.. అంతకంతకూ విస్తరిస్తోంది. దీనికి కారణమేంటి? దీని వెనుకున్నదెవరు? దీనిపై అక్కడి ప్రభుత్వం ఏం చేస్తుంది? అధికార పార్టీ స్టాండ్ ఏంటి? విపక్షం తీరు ఎలా ఉంది? ఇప్పుడే ఈ వ్యవహారం తెర మీదకు రావటానికి కారణాలు ఏమని చెబుతున్నారు? లాంటి ప్రశ్నలకు సమాధానాల్ని వెతికితే.. అసలీ అంశంపై క్లారిటీ రావటం ఖాయం. ప్రస్తుతం బంగ్లాదేశ్ కు ప్రధానమంత్రిగా వ్యవహరిస్తున్నారు షేక్ హసీనా. ఆమె ఈ జనవరిలో ఐదోసారి అధికారంలోకి వచ్చారు. ఆమె పవర్లోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియా వేదికగా మొదలైన ఈ ప్రచారం అంతకంతకూ పెరిగి.. ఉద్యమంగా మారింది. బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాల్లో భారత్ జోక్యం చేసుకుంటుందని.. తమసొంత ప్రయోజనాల కోసమే షేక్ హసీనాను మళ్లీ ప్రధానిగా చేస్తున్నారంటూ ఐరోపా.. అమెరికాలో ఉంటున్న ప్రవాస బంగ్లాదేశీయులు ఈ ప్రచారాన్ని మొదలు పెట్టారు. ఈ ప్రచారానికి దన్నుగా భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల్ని కొనొద్దని.. వాడొద్దని బంగ్లాదేశ్ ప్రజల్ని కోరుతున్నారు. ప్రస్తుతం పారిస్ లో ఉంటున్న బంగ్లాదేశీ వైద్యుడు పినాకీ భట్టాచార్య ఈ ఆన్ లైన్ ఉద్యమానికి తెర తీసినట్లుగా చెబుతారు. ప్రవాసీ బంగ్లాదేశీల పిలుపుతో బంగ్లాదేశ్ లోని కొన్ని వర్గాలు ఈ నినాదానికి మద్దతు ఇవ్వటంతో దీన్ని రాజకీయ అస్త్రంగా మార్చింది అక్కడి ప్రతిపక్ష పార్టీ బీఎన్ పీ. బాయ్ కాట్ భారత్ నినాదాన్ని అందిపుచ్చుకొని ప్రధాని షేక్ హసీనా భారత అవసరాల కోసమే పని చేస్తున్నట్లుగా ప్రచారాన్ని షురూ చేశారు. తమ వాదనకు బలం చేకూరేలా వారు కొన్ని వాదనల్ని వినిపిస్తున్నారు. అందులో ముఖ్యమైనది.. తాజాగా ముగిసిన బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలు. ఇవి అత్యంత వివాదాస్పదమైనవిగా ముద్ర పడింది. ప్రతిపక్షాలు ఎన్నికల్ని బహిష్కరించినప్పటికీ హసీనా ప్రధానిగా ఎన్నికయ్యారు. ఎన్నికల్లో ఆమె విజయం సాధించారన్న వార్తలు వచ్చినంతనే.. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆమెకు శుభాకాంక్షలు తెలపటం.. తమ మద్దతును ప్రకటించటమే దీనికి నిదర్శనంగా పేర్కొంటున్నారు. అయితే.. బాయ్ కాట్ బంగ్లాదేశ్ ఉద్యమం అక్కడి ప్రజల్లో కాకుండా రాజకీయ ఎజెండాతోనే మొదలైనట్లుగా పలువురు వాదనలు వినిపిస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ వ్యవహారం ట్రెండింగ్ లో ఉన్నదే తప్పించి వాస్తవంలో ఈ అంశానికి అంత జనాదరణ లేదంటున్నారు. బాయ్ కాట్ భారత్ ఉద్యమంపై ఆ దేశ ప్రధాని షేక్ హసీనా తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఇండియా నుంచి దిగుమతి చేసుకున్న వస్తువుల్ని బాయ్ కాట్ చేయాలంటే ప్రతిపక్ష బీఎన్ పీ నేతలు ముందు తమ భార్యల చీరలన్నింటికి కాల్చేయాలన్నారు. బీఎన్ పీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతల భార్యలు భారత్‌కు వెళ్లి భారీ సంఖ్యలో చీరలు కొనుక్కొని రావటం.. వాటిని బంగ్లాదేశ్ లో అమ్మటం చూశానని చెప్పిన ఆమె.. 'వాటన్నింటిని కాల్చేస్తారా? భారత్ నుంచి దిగుమతి చేసుకుంటున్న మసాలాలు.. ఉల్లిపాయలు.. అల్లం.. వెల్లుల్లి లాంటివి లేకుండా విపక్ష నేతలు.. వారి కుటుంబాలు తమ వంటల్ని తయారు చేసుకొని తినాలి" అంటూ వ్యాఖ్యానించారు. ఇక్కడే మరో అంశాన్ని ప్రస్తావించాలి. మాల్దీవుల్లోనూ భారత వ్యతిరేక నినాదంతోనే అక్కడ అధికారంలోకి వచ్చారు మయిజ్జు. తాజాగా బంగ్లాదేశ్ లోనూ ఇదే తరహా వ్యూహాన్ని అమలు చేస్తున్న వైనం చూస్తే.. సమ్ థింగ్ రాంగ్ అన్న భావన కలుగక మానదు. ఇదిలా ఉంటే రంజాన్ నేపథ్యంలో బంగ్లాదేశ్ కు 50వేల టన్నుల ఉల్లిగడ్డల్ని పంపాలని భారత్ నిర్ణయించటం గమనార్హం. ఏమైనా ఈ తరహా ఉద్యమాల్ని షురూ చేసే వారి బ్యాక్ గ్రౌండ్ విషయంలో భారత మీడియా సైతం చురుగ్గా పని చేయటంతో పాటు.. అందులోని కుట్రల్ని ఛేదించాల్సిన అవసరం ఉందని చెప్పక తప్పదు.

# పుష్కర ఘాట్లకు మోక్షమెప్పుడో?



వేములవాడ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులు గుడి చెరువులో పుష్కర ఘాట్లలో పుణ్యస్నానాల ఆచరణ ఇప్పట్లో సాధ్యం అయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. పుష్కర ఘాట్ల నిర్మాణ పనులు ఇప్పటికీ ఓ కొలిక్కి వచ్చిన దాఖలాలు లేవు. పుష్కర ఘాట్లతో పాటు గుడి చెరువు చుట్టూ రింగ్ బండ్ నిర్మించాల్సి ఉంది. దీని కోసం ఇప్పటి వరకు భూసేకరణ కాలేదు. దీంతో పనులు ఏడేళ్లుగా మూలుగుతూనే ఉన్నాయి.

వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకునేందుకు నిత్యం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారు. వీరు ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. దీనితో పాటు గుడి చెరువులో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు వీలుగా పుష్కరఘాట్ల నిర్మాణానికి 2016-17లో ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు మిషన్ కాకతీయ పథకంలో దాదాపు రూ.17 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో పనులకు శ్రీకారం చుట్టారు. గుడి చెరువు చుట్టూ 1.2 కిలో మీటర్ల పొడవు బండ్ నిర్మించాల్సి ఉంది. ఇందులో ఆలయ పార్కింగ్ స్థలం వైపు 800 మీటర్ల పొడవు పుష్కర ఘాట్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం బండ్‌ను సిద్ధం చేసినప్పటికీ మిగతా పనులు జరగడం లేదు. దీంతో ఏళ్లుగా భక్తులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

రూ.15 కోట్లతో లిఫ్టు ఏర్పాటు

గుడి చెరువులో పుష్కరఘాట్ల నిర్మాణం పూర్తయితే భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు ఏడాది పొడవునా గోదావరి జలాలు అందుబాటులో ఉండే విధంగా రూ.15 కోట్లతో మధ్యమానేరు నుంచి పంపింగ్ ద్వారా గుడి చెరువులోకి నీటి సరఫరాకు లిఫ్టు ఏర్పాటు చేశారు. దీని ద్వారా గుడి చెరువును నింపి గోదావరి జలాల్లో భక్తులు స్నానాలు చేసేందుకు అనుగుణంగా స్నానాల ఘాట్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. లిఫ్టు పూర్తయి మధ్యమానేరు జలాలు గుడి చెరువులోకి వస్తున్నప్పటికీ ఘాట్ల నిర్మాణ పనులు మాత్రం పూర్తి కాలేదు. ఇవి పూర్తయితే భక్తులు అటు ధర్మగుండంలోనూ, ఇటు గుడి చెరువులోనూ గోదావరి జలాలతో స్నానాలు చేసే వీలు కలగనుంది. ఇటీవల మహా శివరాత్రి జాతర సందర్భంగా వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. వీరంతా ధర్మగుండంలో స్నానాలు చేయడంతో పెద్ద ఎత్తున రద్దీ ఏర్పడింది. కొందరు పార్కింగ్ స్థలంలోని నల్లాల వద్ద స్నానాలు చేశారు. పుష్కర ఘాట్ల నిర్మాణం పూర్తయితే భక్తులకు మరింత సౌకర్యంగా ఉండనున్నది.

ధరలు పెరగడంతో...

పుష్కర ఘాట్ల నిర్మాణ పనులు చేసేందుకు గుడి చెరువులోని నీరు అడ్డంకిగా మారుతోంది. దీనికి తోడు నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో గుత్తేదారు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. గుడి చెరువులో నీటిని తొలగిస్తే ఓ వైపు రైతులకు, మరోవైపు మత్స్యకారులకు నష్టం జరుగుతోందనే అభిప్రాయం ఉంది. ఇందులోని నీరు పూర్తి స్థాయిలో తొలగిస్తే తప్పా పుష్కర ఘాట్ల పనులు ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు. మహా శివరాత్రి సందర్భంలోనూ నీటిని లిఫ్టు ద్వారా గుడి చెరువులోకి పంపింగ్ చేశారు. దీంతో చెరువులో నీటి మట్టం మరింత పెరిగింది.

నీరు తగ్గిన వెంటనే పనులు

గుడి చెరువులో నీటి మట్టం తగ్గిన తరవాత పుష్కరఘాట్ల నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుంది. ఇప్పటికే పంట పొలాలకు నీటిని వదిలి పెట్టాం. చెరువులో నీరు ఉండటంతో పనులు చేపట్టడానికి అవకాశం లేదు. నీరు తగ్గిన తరవాత పనులు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం.ప్రశాంత్, డీఈ, నీటిపారుదలశాఖ

# నేత.. కష్టాల కలబోత



సిరిసిల్ల : తొమ్మిదేళ్లుగా జిల్లా వస్త్ర పరిశ్రమ ప్రభుత్వ సంక్షేమశాఖల ఆర్డర్లతో కాలం వెల్లదీసింది. ప్రస్తుతం ఒక్కసారిగా ఆర్డర్లు తగ్గడంతో కుదేలైంది. వీటికితోడు పరిశ్రమకు రావాల్సిన రూ.275 కోట్ల బకాయిల విడుదలలో జాప్యం నెలకొంది. మరోవైపు ఎస్ఎస్ఐ యూనిట్లకు చెందిన రూ.40 కోట్ల విద్యుత్తు బిల్లుల సమస్య ఏర్పడింది. ఇలా ఒకదానికొకటి తోడవడంతో పరిశ్రమ వర్గాలను కష్టాలు వెంటాడుతున్నాయి.

ఆధునికీకరణ వెనకబాటు

జిల్లాలో ఉన్న 22,494 మరమగ్గాలన్నీ పాతవే. పక్క రాష్ట్రాల్లోని వస్త్రపరిశ్రమ ఎప్పటికప్పుడు ఆధునికతను అందిపుచ్చుకుంటూ వస్త్రాల ఉత్పత్తిలో పోటీ పడుతుంది. మరమగ్గాల ఆధునికీకరణకు రాయితీలు విడుదల చేస్తున్నా వాటిని అందిపుచ్చుకోవడంలో పరిశ్రమ వర్గాలు వెనకబడ్డాయి. 2017-20లో కేంద్రం జిల్లాకు పవర్‌టెక్స్ ఇండియాలో స్థానం కల్పించింది. దీనిలో 12 విభాగాల్లో రూ. 300 కోట్ల మేర రాయితీలకు అవకాశం కల్పించింది. కానీ రూ.20 కోట్లతో కేవలం పది వేల మరమగ్గాలను మాత్రమే ఆధునికీకరించారు. 2022-23లో రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మరమగ్గాల ఆధునికీకరణకు దరఖాస్తులను ఆహ్వానించింది. దీనిలో ఎనిమిది మంది వస్త్రోత్పత్తుల అనుబంధ రంగాల విస్తరణకు రూ.52 కోట్ల ప్రణాళికలతో ముందుకొచ్చారు. ఇక టెక్స్‌టైల్ పార్కులోని మరమగ్గాలకు అప్పటి ప్రభుత్వం టీ-ట్యాప్ (తెలంగాణ టెక్స్‌టైల్ అపరెల్ పాలసీ)ని తీసుకొచ్చింది. దీనిలో 20 మంది యజమానులు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మారడంతో ప్రస్తుతం ఇవన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

వీటిపై దృష్టిపెట్టాలి

మరమగ్గాల వస్త్ర పరిశ్రమలోని మ్యాక్స్, ఎస్ఎస్ఐ యూనిట్లకు పొదుపు సంఘాల మాదిరిగా పావలా వడ్డీ రుణాలివ్వాలి. ప్రభుత్వం నూలు బ్యాంకును ఏర్పాటు చేసి చిన్న, మధ్య తరగతి ఆసాములకు ఉత్పత్తి లక్ష్యంలో ఒప్పంద ప్రాతిపదికన ముందస్తుగా నూలు అందించాలి. సిరిసిల్లలోని మరమగ్గాలను కుటీర పరిశ్రమగా గుర్తించాలి. టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమలకు విద్యుత్తు యూనిట్లకు స్లాబ్ విధానం తీసుకురావాలి. జిల్లా కేంద్రంలో నేతబజారును ఏర్పాటు చేయాలి.

సిరిసిల్ల పట్టణం లలితానగర్‌కు చెందిన చిలుక అనిల్‌కుమార్ 2017 నుంచి 64 మరమగ్గాలతో ఎస్ఎస్ఐ యూనిట్‌ను అద్దెకు తీసుకుని నడిపిస్తున్నాడు. ఇతని వద్ద ఇరవై మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం కాటన్, గ్రే కలర్ పాలిస్టర్ ఉత్పత్తులు చేస్తున్నాడు. ఎస్ఎస్ఐ యూనిట్‌కు రూ.8.23 లక్షల కరెంటు బిల్లు వచ్చింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు రాక, ఇటు విద్యుత్తు బిల్లులు చెల్లించలేక కారా?నాను మూసివేశాడు.

సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన బుధవారపు రాజు అయిదేళ్ల క్రితం 18 మగ్గాలతో ఎస్ఎస్ఐ యూనిట్‌ను అద్దెకు తీసుకున్నాడు. తనతోపాటు ఆరుగురు కార్మికులకు ఉపాధినిస్తున్నాడు. ప్రభుత్వ ఆర్డర్లు లేకపోవడంతో కాటన్ ఉత్పత్తులు నేస్తున్నారు. ఎస్ఎస్ఐ యూనిట్‌కు రూ. 1.02 లక్షల కరెంటు బిల్లు రావడంతో సెస్ సిబ్బంది కనెక్షన్ తొలగించారు. 25 శాతం చెల్లిస్తే పునరుద్ధరిస్తామంటున్నారు. ప్రభుత్వం నుంచి రూ.2 లక్షల పైగా బిల్లులు రావాల్సి ఉంది. ఉత్పత్తి చేసిన వస్త్రం ఇస్తేనే యజమానులు డబ్బులిస్తారు. కారా?నా అద్దె నెలకు రూ.12 వేలు. ప్రతి వారం కార్మికుల వేతనాలకు రూ.10 వేలు చెల్లించాలి. చేతిలో చిల్లిగవ్వలేక కారా?నా మూసివేశాడు.

పెట్టుబడుల్లేక స్తంభించిన పరిశ్రమ

ప్రభుత్వం సేకరించిన వస్త్రోత్పత్తుల బకాయిలు రావాల్సి ఉంది. రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులను సంప్రదిస్తే మూడు నెలలుగా కాలం వెల్లదీస్తున్నారు. వీటి నుంచే నూలు కొనుగోలు చేసిన కంపెనీలకు చెల్లించాలి. ఎంఎస్ఎంఈ నిబంధనల ప్రకారం మార్చి 31లోపు బిల్లులు పాస్ కాకపోతే మొత్తం బిల్లులో 30 శాతం అదనంగా చెల్లించాలి. వీటికి తోడు ఎస్ఎస్ఐ యూనిట్ల విద్యుత్తు బకాయిల సమస్య ఉంది. వీటన్నింటితో పరిశ్రమ వర్గాల్లో పెట్టుబడులు లేక వస్త్రోత్పత్తులు స్తంభించాయి.మండల సత్యం, పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

# అత్యవసరానికి తప్పని అవస్థలు..!

రామగుండం : రామగుండం రైల్వేస్టేషన్ ఎదుట రోడ్డు పక్కన గతంలో మూత్రశాలలు ఉండగా ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. స్టేషన్ స్వాగత తోరణానికి ఇరువైపులా రైల్వే ప్రహరీకి ఆనుకొని ఖాళీ స్థలం ఉంది. ఇక్కడ సామూహిక మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని రైల్వే అధికారులను, నగరపాలక అధికారులను పలువురు కోరినా పట్టించుకోలేదు. ఇప్పుడు ఆ స్థలమంతా కబ్జాకు గురైంది. మసీద్ కార్నర్ కూడలి వద్ద జెన్‌కో క్వార్టర్లకు ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాలు సైతం అక్రమణకు గురయ్యాయి. బ్యాంకు ఎదుట రోడ్డు పక్కన ఖాళీ స్థలమంతా లారీలు, ఆటో ట్రాలీలకు పార్కింగ్ ప్రదేశంగా మారింది. నగరపాలక సంస్థ లేదా ఎన్టీపీసీ సీఎస్సాఆర్ ద్వారా సామూహిక మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని ప్రజలు, రైలు ప్రయాణికులు కోరుతున్నారు.

రామగుండం పట్టణంలో సామూహిక మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ప్రజలు, రైలు ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా వీటిని నిర్మించాలని కోరుతున్నా నగరపాలక సంస్థ, స్థానిక పరిశ్రమల యాజమాన్యాలు పట్టించుకోవడ లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బస్సులు, ఆటోల్లో ప్రయాణించే వారు, బ్యాంకు, ప్రభుత్వ కార్యాలయాలకు పనుల కోసం వచ్చే అంతర్గాం మండలంలోని 16 గ్రామాల ప్రజలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, రైలు ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చిన వారు అత్యవసరానికి ఎక్కడికి వెళ్లాలో తెలియక ఇబ్బందులకు గురవుతున్నారు. వీటి నిర్మాణాలకు స్థలాలు ఉన్నా నిధుల మంజూరు లేక పనులు చేపట్టడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టింది. కాగా నగరపాలక నాలుగు డివిజన్లు ఉన్న రామగుండం పట్టణంలో, ప్రధాన రైల్వేస్టేషన్ ఎదుట సామూహిక మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడం శోచనీయమని స్థానికులు అంటున్నారు.

# జోన్ పరిధిలో మరో వ్యవసాయ కళాశాల

జగిత్యాల : ఉత్తర తెలంగాణ మండల కేంద్రకమైన జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం పరిధిలో పూర్వపు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలోని వ్యవసాయ పరిశోధన, విస్తరణ, బోధన సాగుతుండగా జిల్లాల్లో ఏటికేడు వ్యవసాయ డిగ్రీల సీట్లసంఖ్య పెరుగుతోంది. తాజాగా నిజామాబాద్ లో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టగా స్థానిక రిజర్వేషన్లు, రైతుకోటా రిజర్వేషన్లతో మనప్రాంత విద్యార్థులకు అవకాశాలు మరింతగా పెరుగుతాయి.

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జగిత్యాల పొలాస పరిశోధనస్థానం ఆవరణలో 2008లో వ్యవసాయ కళాశాల, 2013లో పీజీ కళాశాలను ఏర్పాటు చేశారు. వ్యవసాయ కళాశాలలో సీట్లసంఖ్యను 120 నుంచి 150కి, పీజీలో సీట్లు 11 నుంచి 14కు పెంచారు. తదుపరి ఏర్పాటు చేసిన సిరిసిల్ల వ్యవసాయ కళాశాలలో 100 సీట్లు భర్తీ చేస్తుండగా నిరుడు ఆదిలాబాద్‌లో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేశారు. రానున్న విద్యాసంవత్సరంలో నిజామాబాద్‌లో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయటం ద్వారా స్థానికంగానే విద్యార్థులు వ్యవసాయ విద్యను నేర్చుకునే వీలు కలుగుతుంది.

బాలికలే అధికం..

పొలాస పరిశోధనస్థానం ఆవరణలో 1996లో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పరచగా ఇందులో 30-50 వరకు సీట్లు భర్తీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని కోరుట్లలో వెటర్నరీ కళాశాల, కరీంనగర్‌లో పాలిటెక్నిక్, జమ్మికుంటలో వ్యవసాయ పాలిటెక్నిక్, రామగిరిఖిలాలో ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలు ఉండగా వీటిల్లోనూ స్థానిక



విద్యార్థులూ అధికంగానే ఉన్నారు. ఇదివరకు వ్యవసాయ, పశు సంవర్ధక, ఉద్యాన తదితర కోర్సుల కళాశాలల్లో చదివిన వందలాది మంది జిల్లా విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, స్వయం ఉపాధి కల్పనతో ముందుకు సాగుతుండగా కళాశాలలు, సీట్లపెంపు మరికొందరికి ఉపకరించనుంది. కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిబా పులే గురుకుల కళాశాలలోనూ బాలికలకు వ్యవసాయ డిగ్రీ కోర్సును అమలు చేస్తున్నారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) గుర్తింపున్న ప్రైవేటు కళాశాలలు రాష్ట్రంలో లేకపోగా కేవలం ప్రభుత్వ వ్యవసాయ వర్సిటీ ఆధ్వర్యంలోని కళాశాలల్లోనే వ్యవసాయడిగ్రీ కోర్సులుండటంతో వీటికి అధిక గిరాకీ ఉంది. వ్యవసాయ వర్సిటీ పరిధిలో యాజమాన్య కోటాకింద డిగ్రీ సీటు రూ.14 లక్షలుగా ఉండటం ఈ కోర్సులపై డిమాండ్‌ను వెల్లడిస్తోంది. ఈ నేపథ్యంలో వర్సిటీ పరిధిలోని కళాశాలలు, సీట్లసంఖ్యను పెంచగా ఎంసెట్ ర్యాంకులు, స్థానిక రైతుకోటా, ఇతర రిజర్వేషన్ల ద్వారా సీట్లను భర్తీ చేస్తుండగా ఉమ్మడి జిల్లాలోని చాలామంది విద్యార్థుల చేరికకు దోహదం చేయనుంది. మరోవైపు వ్యవసాయ, ఉద్యాన పాలిటెక్నిక్, వెటర్నరీ డిగ్రీ కోర్సుల్లో దాదాపు 60 శాతానికిపైగా బాలికలే చేరుతుండటం విశేషంగా చెప్పవచ్చు.

# పట్టణానికి దూరం.. అభివృద్ధిలో నిర్లక్ష్యం

కోరుట్ల : కోరుట్ల పట్టణ శివారు కాలనీల్లో మౌలిక వసతులు లేక ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి మూడు కిలో మీటర్ల దూరంలోనున్న అర్బన్‌కాలనీ, అయోధ్యపట్నం, బంజారా కాలనీలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2007లో అప్పటి ప్రభుత్వం పట్టణానికి దూరంగా ఉన్న ప్రభుత్వ స్థలంలో సుమారు 800 ప్లాట్లు ఏర్పాటు చేసి అర్బన్ కాలనీని నెలకొల్పింది. నిరుపేదలు ఇళ్లను నిర్మించుకుని 15 ఏళ్లకుపైగా నివాసముంటున్నారు. అయోధ్యపట్నం, బంజారా కాలనీల్లో వందకుపైగా ఇళ్లు నిర్మించుకున్నారు. వెయ్యికిపైగా ఇళ్లు ఉన్నా వైకుంఠధామం నిర్మించకుండా బల్దియా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం వైకుంఠధామం ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించినట్లు ప్రకటించారు. ప్రభుత్వ స్థలం గుర్తించగా చుట్టుపక్కల భూయజమానులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వదిలేశారు. ఎవరైనా చనిపోతే ఎరుకల వాడలోని శ్మశాన వాటికకు తీసుకెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నా అవి సరిపోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. భగీరథ పైపులైన్ మరమ్మతు సమయంలో కాలనీలో రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోతుంది. ప్రధాన రహదారి మినహా అంతర్గత సీసీరోడ్లు వేయలేదు. చాలా ఇళ్లపైనుంచి విద్యుత్తు తీగలు వెళ్లడంతో ప్రమాదకరంగా మారింది. చెత్తసేకరణ వాహనాలు, పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజు రాకపోవడంతో చెత్త పేరుకుపోతుంది. కౌన్సిలర్ అనారోగ్యంతో మరణించి మూడేళ్లవుతున్నా ఎన్నిక నిర్వహించకపోవడంతో సమస్యలను పట్టించుకునేవారు కరవయ్యారు.

మూడు కి.మీ.లు నడవాల్సిందే..

అర్బన్‌కాలనీ ఏర్పడి 16 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు కాలనీ ఆవరణలో శ్మశానవాటికను ఏర్పాటు చేయడం లేదు. ఎవరైనా చనిపోతే మూడు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లి అంత్యక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు.
ప్రసాద్, అర్బన్‌కాలనీ

నీటి సమస్యను తీర్చాలి

కాలనీలో నీటి ఇబ్బందులు ఉన్నాయి. మిషన్ భగీరథ నీరు తక్కువగా రావడంతో సరిపోవడం లేదు. కుళాయిలు రానప్పుడు చేతిపంపు ద్వారా నీటిని పట్టుకుంటూ ఇబ్బంది పడుతున్నాం. బీడీలు చేసుకుని బతికే మాలాంటి వారు ఇళ్లలో బోర్లు వేసుకునే పరిస్థితులు లేవు. మున్సిపల్ అధికారులు కాలనీలో నీటి ట్యాంకులను ఏర్పాటు చేయాలి.
మానస అర్బన్‌కాలనీ

# పేదల కల నెరవేరేనా!

మెట్‌పల్లి : సింగరేణి స్థలాలను క్రమబద్ధీకరించి తమకు పట్టాలు ఇస్తారని ఏడు సంవత్సరాలుగా దాదాపు 186 మంది ఎదురుచూస్తున్నారు. సంస్థ విస్తరించి ఉన్న ఉమ్మడి ఆరు జిల్లాల్లో 19,124 మంది ప్రజలు సంస్థ స్థలాల్లో నివాస గృహాలు నిర్మించుకొని ప్రభుత్వం నుంచి పట్టాలు అందుకోగా అలాంటి భాగ్యం తమకెప్పుడు దక్కుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... రామగుండం నగరపాలక సంస్థ 15వ డివిజన్‌లోని తారకరామానగర్, భాస్కర్‌రావు నగర్ ఏరియాలో దాదాపు పాతిక సంవత్సరాల నుంచి 186 కుటుంబాల వారు సింగరేణి స్థలంలో రేకుల షెడ్లు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. వీరిలో కొంతమంది సింగరేణి సంస్థలో పనిచేసి ఉద్యోగవిరమణ పొందిన వారు ఉండగా మరికొందరు సంస్థలో కాంట్రాక్టు కార్మికులుగా ఇతర కూలీ పనులు చేసుకొని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారే ఉన్నారు. కాగా సింగరేణి స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నవారికి పట్టాలు ఇవ్వాలంటూ దాదాపు ఆరు సంవత్సరాల క్రితం రెవెన్యూ శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా సంస్థ విస్తరించి ఉన్న మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, మందమర్రి, నస్పూర్, భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతాల్లో నిర్దేశించిన స్థలాలను సింగరేణి యాజమాన్యం ప్రభుత్వానికి బదలాయించింది. రామగుండం నియోజకవర్గంలో మల్కాపూర్, కేకే నగర్, ఇందిరానగర్, లక్ష్మీనగర్, హనుమాన్‌నగర్, సంతోష్‌నగర్ ప్రాంతాల్లోని 923.93 ఎకరాల స్థలంలో కొంతభూమినే ఆర్జీ-2 యాజమాన్యం ప్రభుత్వానికి అప్పగించింది సింగరేణి క్వార్టర్ల మధ్యలో తారకరామానగర్, భాస్కర్‌రావునగర్



ప్రాంతాలకు చెందిన స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించలేదు. కాగా ఈ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇవ్వాలంటూ స్థానికులు పలుమార్లు సింగరేణి యాజమాన్యానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సమస్యపై గత ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యే సైతం అసెంబ్లీలో ప్రస్తావించారు. నేటికీ సమస్య పరిష్కారం కాలేదని.. ఇప్పటికైనా పరిశీలించి తమకు పట్టాలు ఇప్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పదేళ్లుగా పన్నులు కడుతున్నాం

-బి.దామోదర్, స్థానికుడు

పాతికేళ్లక్రితం ఈ ప్రాంతంలో ఇంటిని నిర్మించుకున్నాం. ప్రభుత్వానికి పదేళ్లుగా ఇంటిపన్ను, నల్లా పన్ను కడుతున్నాం. పట్టా ఇవ్వకపోవడం వల్ల పలు సమస్యలు ఎదురవుతున్నాయి. పట్టాలు ఇవ్వాలంటూ పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నాం. అయినా ప్రయోజనం లేదు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా మా ఇబ్బందులను గుర్తించి పట్టాలు ఇవ్వాలి.

# కన్నీళ్లే ఉబికి వస్తున్నాయ్!

మహబూబాబాద్ : తీవ్ర వర్షాభావ పరిస్థితులు.. అడుగంటిన భూగర్భ జలాలు.. ఎండుతున్న పంటలు.. చేతికి వచ్చిన చేను నిలువునా నెర్రెలు బాయడంతో అన్నదాతలు కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు.. కొత్తగా బోర్లు వేస్తే నీళ్లు వస్తాయన్న ఆశతో రూ.లక్షల్లో వెచ్చిస్తున్నారు.. నీళ్లు పడక.. పంట దక్కక అప్పుల పాలవుతున్నారు. పాతాళ గంగను పైకి తీసుకురావాలని భగీరథ ప్రయత్నం చేస్తూ.. నాలుగైదు బోర్లు వేస్తున్నా.. చుక్క నీరు పడటం లేదు.

20 శాతమే ఫలితం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9.61 లక్షల ఎకరాల్లో యాసంగి పంటలు సాగవుతుయి. భూగర్భ జలాలు పడిపోవడంతో రైతులు కొత్తగా బోర్ల తవ్వకంపై దృష్టిసారించారు. ఒక్కో రైతు కనీసం ఐదు వరకు వేస్తున్నారు. 350 నుంచి 900 అడుగుల లోతు వరకు తవ్విస్తున్నారు. 100 బోర్లు వేస్తే అందులో 20 శాతమే సక్సెస్ అవుతున్నాయని బోరు యంత్రాల నిర్వాహకులు చెబుతున్నారు.

5 బోర్లు.. రూ.1.60 లక్షల ఖర్చు భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లికి చెందిన కనుమరుగుల సదయ్య పొలంలో బోరు వేస్తున్న దృశ్యమిది.. యాసంగిలో 8 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. రూ.1.20 లక్షల పెట్టుబడి అయింది. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ఇప్పటివరకు 5 బోర్లు వేసినా చుక్కనీరు రాలేదు.



రూ.1.60 లక్షల ఖర్చు చేశారు. అప్పే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు.

చుక్క నీరు రాలే..బోరు వేసిన చోటును చూపిస్తున్న ఈ రైతు జనగామ జిల్లా లింగాలఘనపురం గ్రామానికి చెందిన జాగిళ్లపురం అబ్బులు... మూడు బోరుబావుల కింద 2 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇటీవల బోర్లలో నీరు తగ్గి పొలం ఎండిపోతుండటంతో రూ.50 వేలు వెచ్చించి 2 బోర్లు వేయిస్తే చుక్క నీరు రాలేదు. ఎకరన్నర వరి పంటను రూ.9 వేలకు గొర్రెల మేతకు విక్రయించారు. సుమారు 1.80 లక్షల నష్టం వాటిల్లిందని వాపోయారు.

రూ.3.50 లక్షలు ఖర్చు..

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చింతబావితండాకు చెందిన ఆంగోతు సత్తమ్మ రెండెకరాల్లో వరి సాగుచేశారు. పంట చేతికొస్తుందన్న సమయంలో నీరందక పొలం ఎండింది. దీంతో ఒకే రోజు నాలుగు బోరు బావులను తవ్వించారు. 300 అడుగులు వేసినా చుక్క నీరు రాలేదు. పెట్టుబడులు, బోర్ల తవ్వకానికి రూ.3.50 లక్షల వరకు అప్పుయిందని సత్తమ్మ విచారం వ్యక్తం చేశారు.

ఎనిమిది బోర్లు వేయించినా..

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చింతబావితండాకు చెందిన కునుసోతు శ్రీను రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. నీటిఎద్దడి తలెత్తడంతో మూడు రోజుల వ్యవధిలో ఎనిమిది బోరుబావులను తవ్విస్తే చుక్క నీరు రాలేదు. సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చుయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బోరు డ్రిల్లింగ్‌కు ఖర్చు ఇలా..

డ్రిల్లింగ్ చేసినందుకు(ఫీట్) : రూ.90 కేసింగ్‌కు(ఫీట్) : రూ.300(ఆరున్నర ఇంచులు), రూ.400(ఎనిమిది ఇంచులు)

# భానుడి ప్రతాపం.. కూలీలు సతమతం



రామడుగు : రామడుగు సమీపంలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలు వీరు. పని ప్రదేశానికి ప్రతి రోజు ఉదయం 7 గంటలకు వస్తుంటారు. పనికి సంబంధించి యాప్‌లో హాజరు నమోదు చేసుకునే సరికి ఉదయం 11 గంటలు గడిచిపోతుంది. పని మధ్యలో సేద తీరేందుకు కనీసం వారికి నీడ సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేదు. ప్రమాదవశాత్తు ఎవరికైనా గాయమైతే ప్రథమ చికిత్స కిట్టు కూడా అందుబాటులో లేదు. జిల్లాలో అనేక చోట్ల ఇలాంటి పరిస్థితి కనిపిస్తోంది.రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతూ ప్రచండ భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. మూడు రోజులుగా జిల్లా సగటు ఉష్ణోగ్రతలు దాదాపు 40 డిగ్రీలు ఉంటుంది. ఈ నేపథ్యంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలు ఎండకు తల్లడిల్లుతున్నారు. మాడు పగిలే ఎండలో పనులు చేస్తూ అస్వస్థతకు గురవుతున్నారు. పని ప్రదేశాల్లో కనీస వసతులు కనిపించడంలేదు.

ఏమేం ఉండాలంటే..

చట్ట ప్రకారం.. పని ప్రదేశాల్లో తాగునీరు, నీడకు చలువ పందిళ్లు వేయాలి. నీడ వసతి లేకపోవడంతో సమీపంలోని చెట్ల కింద సేదతీరుతున్నారు. నీరు లేక ఇళ్ల నుంచి తీసుకెళ్తున్నారు. కొన్ని చోట్ల అస్వస్థతకు గురైతే ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉంచడం లేదని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అమలుకాని ఆదేశాలు..

పనులు చేసే చోట నేల గట్టిగా ఉండి మట్టి తవ్వడం కూలీలకు ఇబ్బందిగా మారింది. కొన్నిచోట్ల మట్టి తవ్వే ముందు ట్రాక్టర్ ట్యాంకర్లతో నీటిని పట్టి తవ్వాల్సిన పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదు. గతంలో వెంట తెచ్చుకున్న తాగునీటికి ఒక కూలీకి రూ.2.50, పనిముట్లకు రూ.5 చెల్లించాలని ఆదేశాలు ఉండగా ఏప్రిల్ 1 నుంచి పని ప్రదేశాల్లోనే పచ్చని పరదాలు(టెన్నెట్)తో నీడ, శుద్ధజలం, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని గ్రామీణాభివృద్ధి సంస్థ కమిషనర్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పంచాయతీలకు కలెక్టర్ ఆదేశాలు ఇవ్వగా కొన్ని గ్రామాల్లో సోమవారం వసతులు కల్పించగా.. కొన్నింట ఏర్పాటు చేయలేదు. ఇన్ని రోజులు చేసిన పనికి రూ.272 చెల్లిస్తుండగా నేటి నుంచి రూ.300 చెల్లించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం కూలీలకు ఊరటనిచ్చింది.

జిల్లాలో వివరాలు

మండలాలు: 16

జాబ్‌కార్డులు: 1,22,988

మొత్తం కూలీలు: 2,30,449

మట్టి తవ్వడం కష్టంగా ఉంది

నేల గట్టిగా ఉండి మట్టి తవ్వడం కష్టంగా మారింది. గునపాలు, పారలు ఇవ్వకపోవడంతో మేమే వెంట తెచ్చుకుంటున్నాం. ఎండలకు గంట, రెండు గంటలు పనులు చేస్తేనే అలసిపోతున్నాం. పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలి. వెంట తెచ్చుకుంటున్న నీరు ఒక్కోసారి చాలక గొంతు తడారిపోతుంది.

బాసవేని వెంకటి, లక్ష్మీదేవిపల్లి

అస్వస్థతకు గురవుతున్నారు

ప్రతి రోజు ఉదయం 7 గంటలకు ఇంట్లోంచి వెళ్లి 11 గంటల వరకు పనులు చేస్తున్నాం. ఉదయం 9 గంటలకే ఎండలు తీవ్రమై ఇబ్బందులు పడుతున్నాం. ఉపాధి కోసం పనులకు వెళ్లి ఎండకు కొందరు అస్వస్థతకు గురవుతున్నారు. ఈ సమయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ, తాగునీటి వసతి కల్పించాలి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

చొప్పరి దేవమ్మ, రామడుగు

# పురపాలికలకు ప్రత్యేక నిధులు



కోరుట్ల: వేసవిలో తాగునీటి సరఫరా సక్రమంగా సాగించేందుకు ప్రభుత్వం పురపాలికలకు ప్రత్యేక నిధులు కేటాయించింది. ఈనిధులతో చేతిపంపులు, పవర్‌బోర్‌లు, పంప్‌సెట్‌లు, పైపులైన్ మరమ్మతులు, నూతన పైపులైన్ ఏర్పాటు, ఇతర పనులు చేపట్టాలని నిర్ణయించింది. జిల్లాలో జగిత్యాల పురపాలక సంఘానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.87 లక్షలు, కోరుట్ల మున్సిపల్‌కు ఎస్‌డీఎఫ్(ప్రత్యేక అభివృద్ధి నిధులు) రూ.55.90 లక్షలు, మెట్‌పల్లి బల్దియాకు ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50.09 లక్షలు, ధర్మపురి మున్సిపల్‌కు ఎస్‌డీఎఫ్ రూ.71.17 లక్షలు, రాయికల్ పురపాలికకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.18.30 లక్షలు మంజూరు చేశారు. ఈనిధులతో చేపట్టనున్న పనులను ఇప్పటికే మున్సిపల్ అధికారులు గుర్తించి చేపడుతున్నారు. కొన్ని పనులకు టెండర్లు కొనసాగుతున్నాయి.

జిల్లాలో కొనసాగుతున్న పనులు

జగిత్యాల పట్టణంలో మొత్తం 34 చేతిపంపులను గుర్తించగా 15 మరమ్మతు చేయగా 15 మరమ్మతు కొనసాగుతున్నాయి. ఒక పవర్‌బోరును, 15 చోట్ల నూతన పైపులైన్ ఏర్పాటుకు గుర్తించారు. 35 చోట్ల పైపులైన్ మరమ్మతు చేయాలని గుర్తించగా 16 చోట్ల పూర్తి చేయగా, 17 పనులు చేపడుతున్నారు.

కోరుట్ల పట్టణంలో మొత్తం 9 చేతిపంపులను గుర్తించి 2 మరమ్మతు చేశారు. 9 పవర్‌బోర్‌లను గుర్తించగా 3 పనులు కొనసాగుతున్నాయి. 36 ప్రదేశాల్లో నూతన పైపులైన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 5 చోట్ల పైపులైన్ మరమ్మతు చేయాలని గుర్తించగా ఒక చోట పనులు చేస్తున్నారు.

మెట్‌పల్లి పట్టణంలో 55 చేతిపంపులకు గాను 5 మరమ్మతు చేస్తుండగా రెండు పనులు పూర్తి చేశారు. 30 పవర్‌బోర్‌లను గుర్తించి రెండుచోట్ల పనులు చేస్తున్నారు. 20 చోట్ల నూతన పైపులైన్ ఏర్పాటు చేయాలని గుర్తించారు.

రాయికల్ పట్టణంలో 5 చేతిపంపులకు 3 మరమ్మతు చేయగా, ఒకచోట పనులు పూర్తి చేశారు. 3 పవర్‌బోర్‌లను గుర్తించారు. ఒకచోట నూతన పైపులైన్ నిర్మించాలని నిర్ణయించారు. 7 చోట్ల పైపులైన్ మరమ్మత్తు చేయాల్సి ఉండగా ఒకచోట పనులు చేస్తున్నారు.

ధర్మపురి పట్టణంలో 7 చేతిపంపులకు 2 మరమ్మతు చేయగా, రెండుచోట్ల పనులు చేస్తున్నారు. 23 పవర్‌బోర్‌లకు 2 చోట్ల పనులు పూర్తిచేయగా, ఇంకా మూడుచోట్ల పనులు చేస్తున్నారు. 7 పంప్‌సెట్‌లకు ఒకటి మరమ్మతు చేయగా ఒకచోట్ల పనులు చేపడుతున్నారు. 10 చోట్ల నూతన పైపులైన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 5 చోట్ల పాతపైపులైన్ మరమ్మతు చేయాల్సి ఉంది.


పట్టణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సగటున ఒక్కోవ్యక్తికి రోజుకు 135 లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. జగిత్యాల పట్టణంలో నివసిస్తున్న 1.20 లక్షల జనాభాకు రోజుకు 17 మిలియన్ లీటర్ల(ఎంఎల్‌డీ-మిలియన్ లీటర్స్ పర్ డే) నీటిని సరఫరా చేస్తున్నారు. కోరుట్లలో 86 వేల మందికి రోజుకు 11 ఎంఎల్‌డీలు, మెట్‌పల్లిలో 54,600 జనాభాకు 6 ఎంఎల్‌డీలు, రాయికల్‌లో 20వేల జనాభాకు 1.68 ఎంఎల్‌డీలు, ధర్మపురిలో 18,686 జనాభాకు 2 ఎంఎల్‌డీలు సరఫరా చేస్తున్నట్లు బల్దియా అధికారులు తెలిపారు.

# అడుగంటుతున్న జలం.. హడలుతున్న జనం

పెద్దపల్లి : జిల్లాలో భూగర్భ జల మార్గం మూసుకుపోతోంది. గోదావరి, మానేరు, హుస్సేన్‌మియా వాగు, ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతాల్లో నీటి మట్టాలు పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో ఫిబ్రవరిలో 5.09 మీటర్ల లోతలో జలం ఉండగా మార్చిలో 5.58 మీటర్లతో నెల వ్యవధిలో అర మీటరు లోతులోకి నీటి మట్టం తగ్గింది. జిల్లాలో మంథని మండలం వెక్లాస్‌పూర్‌లో 20.88 మీటర్ల లోతులోకి పడిపోగా రామగుండంలో 1.50 మీటర్లపైనే ఉంది. ఎండ తీవ్రత రోజు రోజుకూ పెరుగుతుండటంతో మరింత లోతులో నీరు జారిపోనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సామర్థ్యానికి మించి వినియోగంతోనే ఈ పరిస్థితి

జిల్లాలో 33 ఫీజోమీటర్ల నుంచి భూగర్భ జల శాఖ అధికారులు ప్రతీ నెల నీటి లెక్కలు తీస్తున్నారు. గతంతో పోల్చితే నీరు పాతాళంలోకి పడిపోతోంది. అక్టోబర్ తర్వాత భారీ వర్షాలు కురవలేదు. అప్పుడప్పుడు వానలు కురిసినా పెద్దగా ఫలితం లేదు. వ్యవసాయం, పరిశ్రమలకు సామర్థ్యానికి మించి నీటిని వినియోగిస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. ఆయకట్టు ప్రాంతమైన జిల్లాలో ప్రతి సీజన్‌లో 2.30 లక్షల ఎకరాల పైనే వరి, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. వరి పంటకు అధిక నీటిని వాడుతుండటంతో భూగర్భ జలం ఇంకిపోవడానికి కారణమవుతోంది. నిరంతరం త్రీఫేజ్ విద్యుత్తు సరఫరాతో మోటార్ల



నుంచి వృథాగా పోతోంది.

తప్పని ప్రమాద ఘంటికలు జిల్లాలో గోదావరి, మానేరు పరీవాహక ప్రాంతాల్లోని మంథని, ముత్తారం, ఓదెల మండలాల్లో నీటి మట్టం పడిపోతుండటంతో ప్రమాదకర సంకేతాలు కనిపిస్తున్నాయి. మార్చిలో రామగుండంలో 1.50 మీ, అంతర్గాం మండలం మొగల్‌పహాడ్‌లో 2.30 మీ, రామగిరి మండలం ముస్త్యాలలో 2.83 మీ. నీటి మట్టం ఉన్నట్లు నమోదైంది. మంథని మండలంలోని గుంజపడుగులో 17.55 మీ, ముత్తారం మండలం ఖమ్మంపల్లిలో 6.36 మీటర్ల లోతులో నీటి లభ్యత ఉన్నట్లు తేలింది. జిల్లాలోని చాలా మండలాల్లో 5 మీటర్లలోపు భూగర్భ జలాలు పడిపోయాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి పంటలు ఎండిపోతున్నాయి.

# ప్లాస్టిక్ ముప్పు.. ఎవరిదీ తప్పు?

భూపాలపల్లి : జిల్లా కేంద్రం భూపాలపల్లి పురపాలిక పరిధిలో రోజుకు 7 ట్రాక్టర్లు, 12 స్వచ్ఛ ఆటోల ద్వారా దాదాపుగా 14 టన్నుల వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. వీటిలో సింహభాగం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. దీనికి తోడు పట్టణంలోని పలు కాలనీల్లోని మురుగు కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లు ఇతరత్రా వ్యర్థాలు పేరుకుపోయి, మురుగు ముందుకు సాగకపోవడంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పట్టణంలో ఏ వీధి చూసినా దుర్వాసన రావడం, దోమలు, పందుల స్వైర విహారంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్డు మార్గంలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో, సంతోషిమాత ఆలయం సమీపంలో, అంబేద్కర్ కూడలి ప్రాంతంలోని సినిమా థియేటర్ వెనుక భాగంలో, కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్ దగ్గర, సంఘమిత్ర డిగ్రీ కళాశాల ఎదురుగా, శ్రీ చైతన్య పీజీ కళాశాల తదితర ప్రాంతాలతో పాటు శివారు ప్రాంతాల్లో ప్లాస్టిక్‌ను కుప్పలుగా పోసి నిప్పుపెడుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు, పారిశుధ్య సిబ్బంది అనునిత్యం కాలబెడుతున్నారు. పట్టణంలోని సీఆర్ నగర్ ప్రాంతంలోని డంపింగ్ యార్డులో నిత్యం ప్లాస్టిక్‌తో పాటు చెత్తాచెదారాన్ని కాలుస్తుండటం వల్ల సమీపంలోని అడవులకు ముప్పు ఏర్పడుతుంది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

జాడలేని తనిఖీలు..

ప్రస్తుత పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు కావస్తున్నా ప్లాస్టిక్ నిర్మూలనలో విఫలమవుతోంది. అధికారులు సైతం నిషేధిత ప్లాస్టిక్‌ను వాడితే జరిమానాలు, సంబంధిత దుకాణాలను సీజ్ చేస్తామని చెబుతున్నారే తప్ప ఆచరణలో అమలు చేయకపోవడంతో దీని వినియోగం పెరిగిపోతోంది. పట్టణంలో ఏ దుకాణంలో చూసినా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు కుప్పలు తెప్పలుగా విక్రయిస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది అడపాదడపా తనిఖీలు చేసి దుకాణ యజమానులపై చర్యలు క్రమంలో కొందరు పాలకులే అడ్డుపడుతున్నారు. 2022లో వివిధ దుకాణాలపై ఏడు కేసులు పెట్టగా పాలకవర్గ కౌన్సిలర్లు తనిఖీలు చేయవద్దని సిబ్బందిని బెదిరించి, సీజ్ చేసిన ప్లాస్టిక్‌ను మరలా అదే దుకాణదారులకే ఇచ్చేశారు. దీంతో పురపాలక సిబ్బంది ప్లాస్టిక్‌పై తనిఖీలు చేయాలనే విషయాన్నే పూర్తిగా మరిచిపోయారు. గడిచిన నాలుగేళ్లలో నాలుగైదు సార్లు మాత్రమే తనిఖీలు చేసినట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు తగు చర్యలు తీసుకునేలా దృష్టి సారించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

# అర్ధరాత్రి తోడేస్తున్నారు!

మహబూబాబాద్ : జిల్లాలో ఇసుక అక్రమానికి అడ్డుకట్ట వేసేందుకు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పలు ప్రయత్నాలు చేస్తున్నా అడ్డుకట్ట వేయలేకపోతోంది. ఒకప్పుడు పగటిపూట తవ్వించినవారు ప్రస్తుతం అర్ధరాత్రి వాగుల నుంచి ఇసుక రవాణా చేస్తున్నారు. దీంతో వాగుల్లో భూగర్భజలాలు అడుగంటాయి. పరివాహక ప్రాంతాల్లోని పొట్టదశలో ఉన్న పంటలు ఎండిపోతున్నాయి. తవ్వకాలు ఇలానే కొనసాగితే రాబోయే రోజుల్లో తాగునీటికి ప్రజలు అల్లాడే పరిస్థితులు నెలకొన్నాయి.

తెల్లవారుజాము వరకు

కొన్ని చోట్ల రాత్రి 9 నుంచి, ఇంకొన్ని చోట్ల అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఈ సమయంలో అధికారులు పట్టుకోరనేది అక్రమార్కుల ఆలోచన. ఒకప్పుడు 300 ట్రాక్టర్లలో ఇసుక రవాణా జరిగేది. నిఘా పెరగడంతో జిల్లాలో సుమారు 60 ట్రాక్టర్ల ద్వారా రవాణా అవుతోంది. ఒక్కో ట్రాక్టరులో 3 క్యూబిక్ మీటర్ల ఇసుక పడుతుంది. ఈ లెక్కన 60 ట్రాక్టర్ల ద్వారా 180 క్యూబిక్ మీటర్ల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.

సిబ్బంది చేతివాటం

పోలీసు అధికారులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేస్తుంటే కింది స్థాయి సిబ్బంది మాత్రం 'మామూలు'గా తీసుకుంటున్నారు. ఇసుక ట్రాక్టర్లను ఆపి ఉన్నతాధికారి లేనప్పుడు సిబ్బంది డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇవ్వని వారిని ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

నర్సింహులపేట మండలం కొమ్ములవంచ సమీపంలోని ఆకేరు వాగు నుంచి రాత్రి వేళలో ఇసుక అక్రమ రవాణా అవుతోంది. జయపురం, కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెం పరిధిలో ప్రవహిస్తోంది. రోజూ 20 ట్రాక్టర్లు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామువరకు రవాణా కొనసాగిస్తున్నాయి.

రాజకీయ నాయకుల ఒత్తిడి

ప్రస్తుతం అనుమతులు లేకుండా రాత్రి సమయంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేయకముందే వాటిని స్టేషన్ నుంచి బయటకు పంపిస్తున్నారు. ఇందుకు రాజకీయ నాయకుల ఫోన్ల ఒత్తిడి కారణమని తెలుస్తోంది.

అధిక ధరలకు విక్రయం

గతంలో ఒక్కో ట్రిప్పు ఇసుకను రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు విక్రయించేవారు. ఇప్పుడు అధికారులు అడ్డుకుంటున్నారనే సాకుతో ఆకేరు వాగులోని ఒక ట్రిప్పునకు రూ.7 వేల వరకు తీసుకుంటున్నారు. మిగిలిన చోట్ల రూ. 5 వేల వరకు విక్రయిస్తున్నారు.

ఈ ప్రాంతాల నుంచే అధికంగా..

నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి, ఎర్రబెల్లిగూడెం, బ్రాహ్మణకొత్తపల్లి, నెల్లికుదురు, మునిగలవీడు గ్రామాల శివారులోని ఆకేరు వాగు నుంచి అర్ధరాత్రి రవాణా కొనసాగుతోంది. రోజుకు పది ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు.

గూడూరు మండలం కొల్లాపురం శివారులోని మున్నేరు వాగును కూడా వదలిపెట్టడం లేదు. తవ్వకాలతో రాళ్లు తేలుతున్నాయి. నీరు నిల్వ ఉండడం లేదని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దంతాలపల్లి మండలం వేములపల్లి, దోనకొండ గ్రామాల సమీపంలో పాలేరు వాగు ఉంది. కొద్ది రోజుల నుంచి తవ్వకాలు జోరందుకున్నాయి. రోజుకు పది ట్రాక్టర్ల ద్వారా అర్ధరాత్రి మండల కేంద్రానికి, ఇతర గ్రామాలకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు ఇసుకను రూ.4500 చొప్పున అమ్ముతున్నారు.

బయ్యారం మండలం కాచనపల్లి సమీపంలోని పెద్దవాగు వద్ద చీకటి పడగానే ట్రాక్టర్లు రోడెక్కుతున్నాయి. ప్రతి రోజు 15 ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నర్సింహులపేట ఎస్సై గండ్రాతి సతీష్ పేర్కొన్నారు. ఆకేరు వాగులో ఇసుక తరలించకుండా ట్రెంచ్‌లు కొట్టామన్నారు. వాటిని పూడ్చి ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.



## భారీ భూకంపం.. ఊగిపోయిన ఫ్లైఓవర్

తైపీ: తైవాన్ ద్వీపాన్ని భారీ భూకంపం కుదిపేసింది. ఈ ఉదయం చోటుచేసుకున్న ఈ విపత్తు కారణంగా పలు భవనాలు నేలకూలాయి. దీంతో ప్రజలు భయాందోళనలతో పరుగులు పెట్టారు. భూకంపం ధాటికి ఏకంగా ఫ్లైఓవర్, వంతెనలే ఊగిపోయాయంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. విపత్తు సంభవించిన సమయంలో తైపీ నగరంలోని ఓ ఫ్లైఓవర్ కొన్ని నిమిషాల పాటు కదిలింది. దానిపై ఉన్న వాహనదారులు భయంతో ఎక్కడికక్కడే ఆగిపోయారు. మరో చోట మెట్రో బ్రిడ్జి ఊగింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. తైవాన్ వ్యాప్తంగా భూకంప ప్రభావం కన్పించింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఈ విపత్తు సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 7.4గా నమోదైంది. అటు జపాన్ దక్షిణ ప్రాంతంలోని పలు దీవుల్లోనూ ప్రకంపనలు కన్పించాయి. భూకంపం కారణంగా తొలుత భారీ సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతానికి ఈ ముప్పు తీవ్రత తగ్గినట్లు తెలుస్తోంది. తైవాన్‌లో 25కు పైగా భవనాలు నేలమట్టమయ్యాయి. ఈ ఘటనల్లో నలుగురు మృతిచెందగా.. 50 మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. మరో 20 మంది చిక్కుకున్నట్లు తెలుస్తోంది. వారి కోసం సహాయక సిబ్బంది గాలిస్తున్నారు. భూకంప తీవ్రత నేపథ్యంలో తైవాన్ వ్యాప్తంగా రైలు సేవలను నిలిపివేశారు. తైపీలో సబ్‌వే సేవలను రద్దు చేశారు. విమానాల రాకపోకలకూ అంతరాయం కలిగింది. గత పాతికేళ్లలో ఇదే అతిపెద్ద భూకంపమని అధికారులు చెబుతున్నారు.

## ఫోన్ ట్యాపింగ్‌పై సీఎం రేవంత్ సీబీఐ దర్యాప్తు కోరాలి: భాజపా ఎంపీ లక్ష్మణ్



హైదరాబాద్: గతంలో ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేశారని భాజపా ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుబ్బాక, మునుగోడు, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లోనూ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. దీని సూత్రధారులపై పూర్తిస్థాయి విచారణ చేయాలన్నారు. సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అసలైన దోషులను వదిలిపెట్టొద్దన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ దర్యాప్తు కోరాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్, భారాస వైఖరి.. టామ్ అండ్ జెర్రీ ఫైట్‌లా ఉందన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు పరస్పర విమర్శలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. 'ధరణి' మీద విచారణకు కమిటీ వేశారని.. దానికి అతీగతీ లేదన్నారు. భారాస ప్రభుత్వం పదేళ్ల పాటు ఫోన్ ట్యాపింగ్ చేసిందన్నారు. దీనిపై గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. దిల్లీ మద్యం కేసులో భారాస ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రాలేదంటే ఆధారాలు గట్టిగా ఉన్నట్లు తెలుస్తోందని చెప్పారు.

## ఫోన్ ట్యాపింగ్‌లో అందరూ బయటకు వస్తారు



హైదరాబాద్, ఏప్రిల్ 3: ఫోన్ ట్యాపింగ్ అంశం రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. ఫోట్ ట్యాపింగ్ వ్యవహారంపై అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తాజాగా ఈ అంశంపై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం మంచిది కాదన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్‌లో అందరూ బయటకి వస్తారన్నారు. అందరి ఫోన్‌లు ట్యాప్ చేశారని.. విచారణలో అన్నీ బయటకు వస్తాయని తెలిపారు. కేటీఆర్ నోటీసులు ఇచ్చుకుంటే ఇచ్చుకో అని అన్నారు. తాము పద్ధతి ప్రకారం పనిచేస్తామన్నారు. మిషన్ భగీరథ తప్పుడు స్కీం అని వ్యాఖ్యలు చేశారు. తాము తెచ్చిన వాటర్ మేకానిజం కంటిన్యూ చేయొద్దని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం తప్పు అని అన్నారు. తమ ప్రభుత్వం గురించి కేటీఆర్ రైతులను అడిగితే తెలుస్తుందని.. తాము ఏం చేస్తామో సంవత్సరంలో చేసి చూపిస్తామన్నారు. రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. పూర్తి స్థాయి బడ్జెట్‌లో రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతి రైతును మోసం చేశారన్నారు. గత ప్రభుత్వ పాలనలో నాటి సీఎం, వ్యవసాయ మంత్రికి రైతుల కోసం ఎన్ని విజ్ఞాపనలు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో వర్షాలుపడలేదని.. కాంగ్రెస్ పాలనలో కరువు వచ్చిందని బీఆర్ఎస్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి కోసం బీఆర్ఎస్ హడావిడి చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యలు చేశారు.

## భానుడి భగభగలు.. గ్రేటర్ పరిధిలో 41-42 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు



హైదరాబాద్ సిటీ: ఎండలు మండుతున్నాయి. గ్రేటర్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో 41-42 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణంగా 2-3 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండడంతో వడగాల్పుల ప్రభావం అధికంగా కనిపిస్తోంది. జనసం చారం తగ్గి రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తు న్నాయి. మంగళవారం అత్యధికంగా మూసాపేట- 41.9, ఖైరతాబాద్, చందానగర్- 41.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




## కేసీఆర్ అంటే నీళ్లు.. కాంగ్రెస్ అంటే కన్నీళ్లు..: కేటీఆర్

హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో తాగునీటి కష్టాలు లేవని.. కేసీఆర్ అంటే నీళ్లు.. కాంగ్రెస్ అంటే కన్నీళ్లు అని.. సాగునీరు లేక పల్లెలు, తాగు నీరు లేక పట్టణాలు తల్లడిల్లుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన హైదరాబాద్‌నలో మీడియాతో మాట్లాడుతూ.. గొంతెండి ప్రజలు గొడవ చేస్తున్నారని, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం గొంతు చించుకుని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. కేసీఆర్ జనగామ, నల్గొండ వెళ్లగానే గాయత్రి, నంది పంపు హౌజ్ ఎలా ప్రారంభం అయింది?.. ఇన్నాళ్లు ఆ నీటిని ఎందుకు దాచి పెట్టారు?.. పంటలు ఎండే పరిస్థితి ఎందుకు తెచ్చారు?.. కొట్టుకుపోయిందన్న కాళేశ్వరం నుంచి జల పరవళ్ళు ఎలా తొక్కాయి?.. ఇది కాలంతో వచ్చిన కరువు కాదని.. కాంగ్రెస్ తెచ్చిన కరువు అని అన్నారు. ఓటు వేయలేదని హైదరాబాద్ ప్రజలపై సీఎం కక్ష కట్టారా? ఎందుకు హైదరాబాద్‌కు మంచి నీరు ఇవ్వడంలేదు?.. ట్యాంకర్‌లు ఎందుకు బుక్ చేసుకునే పరిస్థితి వచ్చింది? అని కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఒక్క మార్చిలోనే 2 లక్షల 30 వేల ట్యాంకర్‌లు బుక్ చేసుకున్నారని, ఈ ట్యాంకర్‌లకు బిల్లులు ముఖ్యమంత్రి కడతారా? అని నిలదీశారు. ట్యాంకర్లను ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. కొండ పోచమ్మ, మల్లన్న సాగర్ నింపాలన్నారు. పాలన అనుభవం లేదని, నేర్చుకోవాలి అన్న జిజ్ఞాస కూడా లేదని విమర్శించారు. ఎవరు ఆత్మహత్యలు చేసుకుంటారో, ఎక్కడ పంటలు ఎండుతయో మేము చెబితే ఇక ప్రభుత్వం ఎందుకన్నారు. అయినా ఆత్మహత్యలు చేసుకున్న 218 రైతుల వివరాలు పంపిస్తామన్నారు. రేవంత్ రెడ్డి లీక్ వీరుడని.. ఫోన్ ట్యాపింగ్‌పై ఓపెన్‌గా మాట్లాడే దమ్ము లేదా? అని ప్రశ్నించారు. హీరోయిన్‌లను బెదిరించాల్సిన కర్మ తనకు లేదని, తనపై మాట్లాడుతున్న మంత్రికి తలకాయ ఉందో లేదో తెలవదన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో అప్పటి అధికారులకు భాధ్యత లేదా? రవిగుప్తా, శివధర్ రెడ్డి, మహేందర్ రెడ్డి బాధ్యులు కాదా? ఒక్క కేసీఆర్ మాత్రమే బాధ్యుడా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌పై 2004 నుంచి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్ పదవులు ఊడటం గ్యారంటీ అని, స్టేషన్ ఘనపూర్, ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికలు జరగడం ఖాయమని, పార్టీ మారిన వారిని మూడు మాసాల్లో డిస్‌క్వాలీఫై చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. స్పీకర్‌కు ఈ ఆదివారం వరకు సమయం ఇస్తున్నామని, ఈ లోపు తేల్చకపోతే హైకోర్టుకు వెళతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై మొదలైన జ్యుడీషియల్ ఎంక్వైరీ..



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై జ్యుడీషియల్ ఎంక్వైరీ ప్రారంభమైంది. సుప్రీంకోర్టు మాజీ జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో స్పెషల్ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఇరిగేషన్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ అధికారుల బృందం నిన్న ఘోష్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ప్రభుత్వం కమిషన్ ఏర్పాటుకు విడుదల చేసిన గెజిట్ ప్రతులను ఘోష్‌కు రాహుల్ బొజ్జ అందించారు. 9 అంశాలతో వివరాలు ఇవ్వాలని ప్రభుత్వానికి ఘోష్ మిషన్ లేఖ రాసింది. జూన్ చివరి వారం నాటికి విచారణ పూర్తి చేయాలని ఘోష్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. వచ్చే వారంలో ఘోష్ కమిషన్ బృందం హైదరాబాద్‌కు రానుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణ లోపాలు, అవకతవకలపై విచారణ జరిపి, బాధ్యులను గుర్తించాలని జ్యుడీషియల్ విచారణ కమిటీని కోరేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఈ మేరకు మంగళవారం కోల్‌కతాలో కమిటీ చైర్మన్ అయిన జస్టిస్ పినాకి చంద్రఘోషను నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా నేతృత్వంలోని అధికారుల బృందం కలవనుంది. ఇప్పటికే రాహుల్‌బొజ్జాతో పాటు ఈఎన్‌సీ (ఓఅండ్‌ఎం) బి.నాగేంద్రరావు, డిప్యూటీ ఈఎన్‌సీ (పీఅండ్‌ఎం) కె.శ్రీనివాస్ కోల్‌కతాకు చేరుకున్నారు. మంగళవారం అపాయింట్‌మెంట్ ఉండటంతో ఆయన్ను కలిసి, టీవోఆర్ అందించి, కేసును వివరించనున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి బూర్గుల రామకృష్ణారావు భవన్ (బీఆర్‌కేఆర్)లో విచారణ కమిటీ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. మొత్తం ఏడు అంశాల ఆధారంగా విచారణ జరిపి, దోషులెవరో గుర్తించి, జూన్ 30లోపు నివేదిక అందించాలని ఘోష్‌ను అధికారులు కోరనున్నారు.

**ఆ ఏడు అంశాలేంటంటే...** మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంతో పాటు ప్లానింగ్, డిజైనింగ్‌లో లోపాలు, అవకతవకలు, నిర్లక్ష్యంపై విచారణ చేపట్టాలి, కాంట్రాక్టర్లకు పని అప్పగింత, పనుల అమలు తీరు, అవకతవకలు, ఆర్థిక క్రమశిక్షణ పాటించకుండా కాంట్రాక్టర్లకు పనుల అప్పగింతకు కారకులను గుర్తించాలి. 3 బ్యారేజీల్లో ఆపరేషన్ మెయింటెన్స్‌లో నిర్లక్ష్యానికి బాధ్యులైన వారితో పాటు బ్యారేజీలు దెబ్బతినడానికి గల కారణాలను తేల్చాలి. క్వాలిటీ కంట్రోల్, పర్యవేక్షణ కోణంలో నిర్లక్ష్యం, కాంట్రాక్టర్లు/ఏజెన్సీలు, శాఖలోని అధికారుల తప్పిదాలపై విచారణ జరపాలి. నిబంధనలకు విరుద్ధంగా పనులు పూర్తి చేయడానికి పొడిగింపులు (ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్-ఈవోటీ), పనులు పూర్తయినట్లు కాంట్రాక్టర్లకు సర్టిఫికెట్లు ఇవ్వడం, గడువు కన్నా ముందే బ్యాంకు గ్యారెంటీలను విడుదల చేయడం, కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరించడం వంటి అంశాల్లో బాధ్యులైన అధికారులను గుర్తించాలి. కోరిన అన్ని అంశాల్లో బాధ్యులను గుర్తించడం, దానివల్ల ఖజానాపై పడిన ఆర్థిక భారం, ఆర్థిక నష్టాలు, ఏజెన్సీల పాత్రను నిగ్గుతేల్చాలి. ఇంకా ఇతర ఏమైనా అంశాలు ప్రభుత్వం సిఫారసు చేస్తే.. వాటిపై విచారణ చేయాలి..

## లోక్‌సభ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ మిగలదు



సూర్యాపేట, ఏప్రిల్ 3: 75 ఏళ్ళ స్వాతంత్ర్యం అనంతరం ప్రధాని మోదీ హయాంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని.. మరోసారి మోదీ అధికారంలోకి వస్తే దేశం ఇంకా ప్రమాదంలో పడుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎంలను జైలుకు పంపుతున్నారని, ప్రతిపక్షాలను దర్యాప్తు సంస్థలతో ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అకౌంట్స్ ఫ్రీజ్ చేసి ఎన్నికల ప్రచార ప్రక్రియకు ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీలోనే లేదని... వాళ్లకు సున్నా సీట్లంటూ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ మిగలదన్నారు. 13 -14 స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఉనికికి ప్రమాదం వచ్చిందని కాంగ్రెస్‌పై అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దతు ధరకు కొనుగోలు చేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 24 గంటలు సప్లై, డిమాండ్ పెరిగినా విద్యుత్ కోతలు ఉండవన్నారు. కరువు బీఆర్ఎస్ హయాంలోనే మొదలైందన్నారు. జలాశయాల్లో నీళ్లు లేవని 2 జూలై 2023 నే గుర్తించారని.. పదేళ్ళలో మీరు చేయనివి తాము 100 రోజులో చేశామన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై ఫోన్ టాపింగ్ అస్త్రం ఉపయోగించారని విమర్శించారు. ఫోన్ టాప్పింగ్ కి పాల్పడి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

## రుణమాఫీ ఎప్పుడు చేస్తారు? సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు బహిరంగ లేఖ



హైదరాబాద్: రైతులకు తక్షణమే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. డిసెంబర్ 9నే చేస్తామని మేనిఫెస్టోలో చెప్పారని గుర్తు చేశారు. రుణమాఫీ అయ్యాక మళ్లీ రూ.2 లక్షల రుణం తీసుకోవాలన్నారని తెలిపారు. రేవంత్ మాటలు నమ్మి లక్షల మంది అప్పులు తీసుకున్నారన్నారు. "రేవంత్ ప్రకటించినట్లు డిసెంబర్ 9న రుణమాఫీ జరగలేదు. అధికారంలోకి వచ్చి 4 నెలలవుతున్నా ఒక్క రైతుకూ అందలేదు. దీన్ని ఏవిధంగా అమలు చేస్తారో స్పష్టం చేయాలి. పంట మద్దతు ధరపై రూ.500 బోనస్ ఇవ్వాలి. ఎకరానికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించాలి. సాగునీరు, 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేయాలి. రాష్ట్రంలో ఈ నాలుగు నెలల కాలంలో 209 మంది అన్నదాతలు చనిపోయారు. రుణమాఫీ విషయంలో బ్యాంకర్ల ఒత్తిళ్లు, వేధింపులకు తట్టుకోలేక ప్రాణం తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## వయనాడ్‌లో నామినేషన్ వేసిన రాహుల్ గాంధీ

వయనాడ్: లోక్‌సభ ఎన్నికల్లో తన సిటింగ్ స్థానం వయనాడ్(కేరళ) నుంచి పోటీచేస్తోన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అంతకు ముందు ఆయన తన నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించారు. తన సోదరి ప్రియాంకా గాంధీ వెంటరాగా ఆయన రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో భారీ సంఖ్యలో మద్దతుదారులు రాహుల్ చిత్రాలను ప్రదర్శిస్తూ వారిని అనుసరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. "వయనాడ్‌లో ప్రతివ్యక్తి నాకు ప్రేమ, అభిమానాన్ని అందించారు. సొంత వ్యక్తిలా చూసుకున్నారు. ఈ ప్రాంతం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తుండటం గౌరవంగా భావిస్తున్నాను. మిమ్మల్ని నేను ఓటర్లుగా భావించను. నా సోదరి ప్రియాంక గురించి ఎలా ఆలోచిస్తానో మీ గురించి అంతే. అందుకే వయనాడ్‌లో నాకు సోదరీమణులు, తల్లులు, సోదరులు ఉన్నారు' అని పేర్కొన్నారు. హస్తం పార్టీ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ రాహుల్ ప్రసంగాన్ని అనువదించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి బరిలోకి దిగిన రాహుల్.. సమీప అభ్యర్థి పి.పి.సునీర్ (సీపీఐ)పై 4.31 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈసారి సీపీఐ తరఫున అనీ రాజా ఇక్కడ పోటీ చేస్తున్నారు. విపక్ష 'ఇండియా' కూటమి పార్టీ అయిన సీపీఐ అక్కడ అభ్యర్థిని దించడం చర్చనీయాశంమైంది. ఈ రోజే అనీ రాజా కూడా నామినేషన్ వేశారు. మరోపక్క భాజపా ఇక్కడ రాష్ట్ర అధ్యక్షుడు కె. సురేంద్రన్‌ను బరిలో దింపింది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660